


# మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న
మన దునియా
మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది.
రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335 నంబర్లకు
వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



సంపుటి: 04 సంచిక: 37 మంగళవారం, అక్టోబర్ 13, 2026 వెల: రూ.4.00




# కల్తీ నూనె దందా!

**ఇరాన్-అమెరికా యుద్ధం సాకుతో ధరల పెంపు?**
**దీపం నూనె పేరుతో లూజ్ విక్రయాలు**
**వ్యాపారుల ఇష్టారాజ్యం.. అధికారుల తనిఖీలు ఎక్కడ?**
**ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ చేసినా స్పందన కరువు!**





**మన దునియా,నిజామాబాద్ జిల్లా: అక్టోబర్ 12**

నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు సతమతమవుతుంటే.. మరోవైపు నూనె విక్రయాలపై అనుమానాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కొన్ని మార్కెట్ ప్రాంతాల్లో దీపం నూనె పేరుతో డ్రమ్ముల నుంచి లూజ్‌గా నూనె విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూనె నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నారా? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.

**బ్రాండ్ల మాటున ఏం జరుగుతోంది?**

నిజామాబాద్ గాంధీ చౌక్, మార్కెట్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో కొన్ని దుకాణాల్లో నూనెను డ్రమ్ములు, ప్లాస్టిక్ క్యాన్ల నుంచి కొలతల ప్రకారం విక్రయిస్తున్నట్లు సమాచారం. పావు లీటరు రూ.53, అర లీటరు రూ.110, లీటరు రూ.160 చొప్పున విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే విక్రయిస్తున్న నూనె రకం, నాణ్యత, ధరల వివరాలను సంబంధిత అధికారులు నిర్ధారించాల్సి ఉంది.


మిగతా 2 లో


## తెలంగాణ - జపాన్ భాగస్వామ్యానికి కొత్త బాట

- మంత్రి వివేక్ వెంకటస్వామితో హిరోషిమా ప్రతినిధి బృందం భేటీ
- పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై విస్తృత చర్చలు
- 45 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందించడమే లక్ష్యం
- జపాన్‌లో యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలపై దృష్టి

**హైదరాబాద్, అక్టోబర్ 12 మన దునియా:**

తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు యువతకు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జపాన్‌లోని హిరోషిమా ప్రాంతంతో పరస్పర సహకారాన్ని విస్తరించనున్నట్లు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో హిరోషిమా ప్రిఫెక్చురల్ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ, హిరోషిమా మధ్య పారిశ్రామిక రంగంలో పెట్టుబడుల ప్రోత్సాహం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, నైపుణ్యాభివృద్ధి, యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై చర్చించారు. రెండు ప్రాంతాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం ద్వారా రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు స్థానిక యువతకు మెరుగైన అవకాశాలు కల్పించవచ్చని మంత్రి అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.


మిగతా 2 లో




## ఓటు హక్కు పరిరక్షణకు మరో పోరాటం



- ఎస్ఐఆర్‌పై మోదీ, షాలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు
- 'జ్ఞానేశ్ గో బ్యాక్' నినాదంతో ఉద్యమానికి పిలుపు
- దళితులు, గిరిజనులు, పేదల ఓట్ల తొలగింపుపై ఆందోళన
- రాహుల్‌గాంధీ నేతృత్వంలో పోరాడాలని కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం


మిగతా 2 లో


**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 మన దునియా:**

ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమం వంటిదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఓటు హక్కు పరిరక్షణ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఓటు బచావో.. దేశ్ బచావో' ఉద్యమంలో భాగంగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాట సమయంలో 'సైమన్ గో బ్యాక్' నినాదం ఉద్యమానికి ఊపునిచ్చిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 13, 2026

# కొండాపూర్ పంచాయతీ నిధుల గోల్మాల్పై వీడని సస్పెన్స్..?

## రాజంపేట మండలం కొండాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన నిధుల అక్రమాల వ్యవహారంపై ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై సస్పెన్స్ రోజురోజుకూ పెరుగుతోంది.

**ఉమ్మడినిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

తాడ్వాయి : రాజంపేట మండలం కొండాపూర్గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన నిధుల అక్రమాల వ్యవహారంపై ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదుపై సస్పెన్స్ రోజురోజుకూ పెరుగుతోంది. అభివృద్ధి పనుల బిల్లుల స్వాహా, ప్రైవేట్ ఖాతాలకు పంచాయతీ చెక్కుల మళ్లింపు వంటి ఫిర్యాదులో వివరించిన వ్యవహారాలు వెలుగులోకి వచ్చినప్పటికీ, అధికారుల నుంచి ఎలాంటి చర్యలు లేకపోవడంపై నీలి మేఘాలు కమ్ముకున్నాయి.

**గ్రామసభలో ఆధారాలిచ్చినా నిర్లక్ష్యం..**

గతంలో జూన్ 13న నిర్వహించిన గ్రామసభలో నిధుల దుర్వినియోగానికి సంబంధించిన పూర్తి ఆధారాలతో మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఆ గ్రామస్థుడు వినతిపత్రం సమర్పించారు. అయితే, స్పష్టమైన ఆధారాలు ఇచ్చినా ఎంపీవో పట్టించుకోకపోవడం, చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ఈ మౌనం వెనుక బాధ్యులను కాపాడే ప్రయత్నం జరుగుతోందనే అనుమానాలు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. వెల్లువెత్తుతున్నాయని

**కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు..**

స్థానిక మండల స్థాయిలో న్యాయం జరగకపోవడంతో బాధితులు, గ్రామస్థులు సెప్టెంబర్ 07న కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆశ్రయించారు. జూన్ 13న గ్రామసభలో ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి విచారణ చేపట్టకపోగా, ఎలాంటి చర్యలు తీసుకోలేదని, నిధుల గోల్మాల్కు పాల్పడిన వారిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

**డీపీఓ టేబుల్ వద్దే ఫైల్.. చర్యలేవి ?**

ఈ నిధుల దుర్వినియోగంపై విచారణకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం జిల్లా పంచాయతీ అధికారి టేబుల్పైనే ఉన్నట్లు సమాచారం. నివేదిక తయారై రోజులు గడుస్తున్నా, చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న ఆలస్యంపై పలు ప్రశ్నలు




తలెత్తుతున్నాయి. కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదు ఆధారంగానైనా స్పందించి, నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అధికారులు,

**డీపీఓ టేబుల్ వద్దే ఫైల్.. చర్యలేవి ?**

ఈ నిధుల దుర్వినియోగంపై విచారణకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం జిల్లా పంచాయతీ అధికారి టేబుల్పైనే ఉన్నట్లు సమాచారం. నివేదిక తయారై రోజులు గడుస్తున్నా, చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న ఆలస్యంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదు ఆధారంగానైనా స్పందించి, నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అధికారులు, ప్రజాప్రతినిధులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాధనాన్ని కాపాడాలని.. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని ఫిర్యాదుదారులు హెచ్చరిస్తున్నారు. ఇదే విషయమై డీఎల్పీఓ అధికారిని దిశ వివరణ కోరగా.. కొండాపూర్ గ్రామపంచాయతీకి సంబంధించిన ఫిర్యాదుపై విచారణ నివేదిక ఇచ్చి చాలా రోజులవుతోందని, ఫైల్ సర్క్యులేషన్లో ఉందని, డీపీఓ నుంచి జిల్లా కలెక్టర్కు బదిలీ చేయాల్సి ఉందని తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# ప్రజలపై అదనపు భారం.. కల్తీ నూనె దందా!








**దీపం నూనె పేరుతో దందా?**

పండుగల సమయంలో దీపం నూనెకు డిమాండ్ పెరుగుతుండటంతో కొందరు వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నూనె ఏ రకానికి చెందినది? ఎక్కడ తయారైంది? నాణ్యత పరీక్షలు జరిగాయా? లేబులింగ్, ప్యాకేజింగ్ నిబంధనలు పాటిస్తున్నారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

నిజామాబాద్తో పాటు బోధన్, ఆర్మూర్, బాల్కొండ, కమ్మర్పల్లి, డిచ్పల్లి, ధర్పల్లి, కామారెడ్డి ప్రాంతాల్లోనూ నూనె విక్రయాలపై తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**లూజ్ ఆయిల్పై అధికారుల చర్యలేవి?**

నిజామాబాద్ పట్టణంలోని ఓల్డ్ శ్రీదేవి థియేటర్, తిరుమల టాకీస్ చౌరస్తా సమీపంలోని ఓ హోల్సేల్ దుకాణంలో లూజ్ ఆయిల్ విక్రయిస్తున్నారని స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అధికారులు నూనెను స్వాధీనం చేసుకుని నమూనాల పరీక్ష కోసం తీసుకెళ్లినట్లు సమాచారం.అయితే ఆ నూనె కల్తీదా? నిబంధనల ఉల్లంఘన జరిగిందా? పరీక్షల నివేదిక ఏమి చెబుతోంది? అన్న వివరాలు వెల్లడికావాల్సి ఉంది. నమూనాల ఫలితాలు ప్రజలకు తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు.

**ఫుడ్ ఇన్స్పెక్టర్ స్పందన ఏది?**

ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు ఫుడ్ ఇన్స్పెక్టర్కు ఫోన్ చేసినప్పటికీ స్పందన రాలేదని సమాచారం సేకరించినవారు పేర్కొంటున్నారు. దీంతో ఆహార భద్రతా విభాగం పర్యవేక్షణపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే అధికారుల వివరణ అందుబాటులోకి వస్తేనే పూర్తి వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?**

నూనె నాణ్యతపై అనుమానాలు ఉన్నప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా అధికారులు వెంటనే స్పందించాలి. దుకాణాల్లో విక్రయిస్తున్న నూనె నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాలి. నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.



మొదటిపేజీ తరువాయి

# ఓటు హక్కు పరిరక్షణకు మరో పోరాటం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 మన దునియా;**

ఓటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమం వంటిదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఓటు హక్కు పరిరక్షణ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఓటు బచావో.. దేశ్ బచావో' ఉద్యమంలో భాగంగా ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాట సమయంలో 'సైమన్ గో బ్యాక్' నినాదం ఉద్యమానికి ఊపునిచ్చిందని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ఇప్పుడు ఓటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'ఎస్ఐఆర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం ఏర్పడిందని వ్యాఖ్యానించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలపై ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని, దాని విశ్వసనీయతకు భంగం కలిగితే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ద్వారా ఓటు హక్కు లేని అర్హులకు అవకాశం కల్పించడంపై ప్రధానంగా దృష్టి పెట్టేవారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వాల కాలంలోనూ ఈ ప్రక్రియ జరిగినట్లు గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం ఇప్పటికే ఓటు హక్కు కలిగిన వారి పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామక విధానంలో 2023లో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులపైనా ఆయన విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం స్వతంత్రత, నియామక ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటర్ల జాబితా సవరణలో రాజకీయ జోక్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు, పేదలు, యువత ఓటు హక్కులను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. సామాజిక మాధ్యమాల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అభిప్రాయాలు వ్యక్తం చేసేవారిని లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. 2014లో దేశంలో సుమారు 81 కోట్ల మంది ఓటర్లు ఉండగా, 2019లో ఈ సంఖ్య సుమారు 91 కోట్లకు, 2024 ఎన్నికల నాటికి దాదాపు 97 కోట్లకు చేరిందని వివరించారు. 2026లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని, ఈ సంఖ్యను 20 కోట్లకు పెంచే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ గణాంకాలు, ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని, జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఓటర్ల సంఖ్యలో మార్పులకు సంబంధించిన వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని కోరారు.రాహుల్‌గాంధీ నాయకత్వంలో ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమాన్ని మరింత విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులకు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రతి పౌరుడికీ సమాన హక్కులు కల్పించిందని, ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఆయుధమని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించకుండా చూడాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంచే చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పరిశీలకుడు సచిన్ సావంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చేసిన ఓటర్ల తొలగింపు ఆరోపణలకు సంబంధించి ఎన్నికల సంఘం స్పందన ఈ సమాచారంలో ప్రస్తావించబడలేదు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణ--జపాన్ భాగస్వామ్యానికి కొత్త బాట

తెలంగాణను మూడు లక్షల కోట్ల అమెరికా డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఇందులో భాగంగా 45 లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. పరిశ్రమల్లో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగాల స్వభావం, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ అందించడం అవసరమని పేర్కొన్నారు. కేవలం విద్యార్హతలు మాత్రమే కాకుండా ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు, వృత్తిపరమైన సామర్థ్యాలు, పని అనుభవం కూడా యువతకు ఉపాధి సాధనలో కీలకమని వివరించారు. పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా శిక్షణ కార్యక్రమాలను రూపొందించడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచవచ్చని తెలిపారు. రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. జపాన్‌లో ఉద్యోగాలు పొందాలనుకునే తెలంగాణ యువతకు జపనీస్ భాషలో శిక్షణ అందించడంతో పాటు అక్కడి పరిశ్రమల పని సంస్కృతిపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి వివరించారు. జపాన్ పరిశ్రమల్లో క్రమశిక్షణ, సమయపాలన, ఖచ్చితత్వం, నాణ్యతకు అధిక ప్రాధాన్యం ఉంటుందని, అక్కడ పనిచేయాలనుకునే యువత ఈ అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భాషా నైపుణ్యాలు మెరుగుపడితే విదేశీ సంస్థల్లో పనిచేసే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను అధిగమించవచ్చని తెలిపారు. ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు స్థానిక భాష, పని విధానాలపై శిక్షణ అందించడం ద్వారా యువత అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకునే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం శిక్షణ సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ, హిరోషిమా మధ్య పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని సమావేశంలో ఆకాంక్షించినట్లు వివేక్ వెంకటస్వామి తెలిపారు. జపాన్ పరిశ్రమల అనుభవం, సాంకేతిక సామర్థ్యాన్ని తెలంగాణలోని పారిశ్రామిక అవకాశాలతో అనుసంధానించడం ద్వారా కొత్త ప్రాజెక్టులకు మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనతో పాటు స్థానిక యువతకు శిక్షణ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తే పెట్టుబడుల ప్రయోజనాలు రాష్ట్ర ప్రజలకు చేరుతాయని వివరించారు. రెండు ప్రాంతాల మధ్య పరస్పర సహకారం పెరిగితే సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక నిర్వహణ, నైపుణ్య శిక్షణ వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సహకారాన్ని కార్యరూపంలోకి తీసుకురావడానికి సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. అంతర్జాతీయ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించడం ద్వారా ఉద్యోగ అవకాశాలను విస్తరించడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపారు. తెలంగాణ--హిరోషిమా మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేయడం ద్వారా పారిశ్రామిక రంగంలో పరస్పర ప్రయోజనాలు సాధించవచ్చని పేర్కొన్నారు. పెట్టుబడులు, నైపుణ్య శిక్షణ, సాంకేతిక సహకారానికి సంబంధించిన చర్చలు భవిష్యత్తులో కార్యాచరణ రూపం దాల్చితే రాష్ట్ర యువతకు అంతర్జాతీయ ఉపాధి మార్గాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుంది. అయితే ప్రతిపాదిత కార్యక్రమాల అమలు, శిక్షణ పొందే వారి ఎంపిక, జపాన్‌లో ఉద్యోగ అవకాశాల కల్పనకు సంబంధించిన నిర్దిష్ట వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

మన దునియా
RNI Number TELTEL/2023/85680
Our News Our World
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 13, 2026

# దసరా సెలవులకు ఊళ్లకు వెళ్తున్నారా..?

## ఇంటి భద్రతపై అప్రమత్తంగా ఉండండి!

### దొంగతనాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి: జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ కుమార్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; అక్టోబర్ 12:**




జన్నారం:దసరా పండుగ, సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రజలు ఇళ్ల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ కుమార్ సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో నిర్లక్ష్యం వహిస్తే దొంగతనాలకు అవకాశం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు తలుపులు, కిటికీలు సక్రమంగా మూసి పటిష్టంగా తాళాలు వేయాలని సూచించారు. బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించేలా సోషల్ మీడియాలో ప్రయాణ వివరాలను బహిరంగంగా వెల్లడించవద్దని సూచించారు. వీలైతే నమ్మకమైన పొరుగువారికి సమాచారం అందించి ఇంటి పరిసరాలపై నిఘా ఉంచేలా చూసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాలు, కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని సూచించారు. పండుగ సంబరాల్లో మునిగిపోయి ఇంటి భద్రతను విస్మరించవద్దని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి దొంగతనాల నివారణకు సహకరించాలని ఎస్సై ఉదయ్ కిరణ్ కుమార్ తెలిపారు.

# ప్రజావాణి ద్వారానే సమస్య పరిష్కారం

## ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్

**నిజామాబాద్ జిల్లా మన దునియా: ఇందల్వాయి అక్టోబర్ 12**



ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ఆరు దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. వీటిలో ఒకటి పోలీస్‌శాఖకు, మరొకటి ఆర్‌అండ్‌బీ శాఖకు, రెండు రెవెన్యూ శాఖకు, మరో రెండు ఆరోగ్యశాఖకు సంబంధించినవిగా గుర్తించి సంబంధిత శాఖల అధికారులకు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

# ఇందల్వాయిలో స్వామివారి భక్తులకు అన్నదానం

**నిజామాబాద్ జిల్లా మన దునియా: ఇందల్వాయి అక్టోబర్ 1**

ఇందల్వాయి మండలంలోని ఇందల్వాయి గ్రామంలో నెలకొల్పిన శ్రీ దుర్గా మాత స్వాములకు శ్రీ సాయిబాబా ఆలయ సన్నిధిలో అన్నదాన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, సుమారు 120 మంది స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి దిగ్విజయంగా పూర్తి చేశారు, కార్యక్రమానికి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతోపాటు సర్పంచ్ లోకని గంగమణి గంగారం, ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు నవీన్ గౌడ్, ఇందల్వాయి సింగిల్విండో చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్ రెడ్డి, వైస్ చైర్మన్ మారుతి నాయక్, తదితరులు నాయకత్వం వహించగా సోమవారం దుర్గామాత స్వామి వారి భక్తులకు అన్నదాన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన దుర్గామాత భక్తులు గ్రామ కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు



# ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీపై కొనసాగుతున్న ఆదివాసుల అసంతృప్తి

## బీఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు..!

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; అక్టోబర్ 12:**

ఉట్నూర్: ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఉట్నూర్ మండలంలోని కొత్తగూడ (జీ), నర్సాపూర్ (జే), అడగూడ గ్రామ పంచాయతీలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆదివాసీ నేతలు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఆదివాసీ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత చిత్తశుద్ధితో వ్యవహరించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసీల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత లభించిందని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమం, అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ, ఆదివాసీ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమం, అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతి కోసం పలు కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ఆదివాసీ ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.





పార్టీలో చేరిన నాయకులు, యువకులకు అండగా ఉంటూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# ఎల్ నినో నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

## రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి.

### అనుభవాలు పంచుకున్న ఆదర్శ రైతు

### ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**



ఎల్ నినో నేపథ్యంలో రైతులకు వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రబీ పంటల ప్రణాళిక, పంటల మార్పిడి , అనువైన పంటల ఎంపిక, సాగు పద్ధతులు, పంటల యాజమాన్యం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులను సమన్వయపర్చి క్షేత్రస్థాయిలో రైతులు పంటల వైవిధ్యీకరణ అవలంభించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితులపైరైతులకు అవగాహన కల్పించేందుకు వీలుగా సోమవారం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రైతు వేదికల ద్వారా రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఇతర వ్యవసాయ, ఉద్యానవన, వాతావరణ, విద్యుత్, భూగర్భజలాలు తదితర శాఖల అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్ ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక నుండి కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ భుజంగరావు తదితరులు కలెక్టర్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో యాసంగిలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. అధిక లాభాలు అందించే ఆయిల్ పామ్ పంట దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేశామని అన్నారు. వ్యవసాయ ఉద్యానవన, విద్యుత్, నీటి పారుదల తదితర శాఖల అధికారులను సమన్వయం చేస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని నవీన్ అనే ఆదర్శ రైతు తన అనుభవాలను పంచుకున్నారు. ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఖరీఫ్ సీజన్ లో తాను వరికి బదులుగా కంది, పెసర, మినుము వంటి పప్పుదినుసు పంటలు సాగు చేయడం ద్వారా అధిక లాభాలు ఆర్జించడం జరిగిందన్నారు. కాగా, ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ నివేదికల ప్రకారం ఎల్‌నినో ప్రభావం డిసెంబర్ నాటికి గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని, 2027 వరకు ఇలాంటి పరిస్థితులు కొనసాగవచ్చని అంచనాలు ఉన్నట్లు తెలిపారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం కారణంగా ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని గత నాలుగు నెలలుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, జిల్లా యంత్రాంగం ద్వారా రైతులను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి అవసరాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, చెరువుల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని అన్నారు. నీటి లభ్యత లేని ప్రాంతాల్లో పంటలు సాగు చేసి నష్టపోవద్దని, కొత్తగా నాటిన ఉద్యాన పంటలను కాపాడుకోవాలని సూచించారు. ఎల్‌నినోపై వచ్చే వదంతులను నమ్మకుండా, రైతులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో వ్యవహరించి విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సహకరించాలని కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎల్‌నినో పరిస్థితులపై రైతులను ముందుగానే అప్రమత్తం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 15 లక్షల ఎకరాల మేర వరి సాగు విస్తీర్ణం తగ్గిందని పేర్కొన్నారు. సాగులో ఉన్న పంటలను కాపాడుకోవడంతో పాటు రబీలో పప్పుదినుసులు, నూనెగింజలు, తక్కువ కాలంలో చేతికొచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. విద్యుత్ సరఫరా, భూగర్భ జలాల లభ్యతపై వాస్తవ పరిస్థితులను రైతులకు తెలియజేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, వాతావరణ శాఖ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయం, పశుసంవర్ధక శాఖల అధికారులు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఆయా శాఖల ద్వారా చేపట్టనున్న చర్యలను వివరించారు. రైతు.నేస్తం కార్యక్రమంలో బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# రహదారులపై మొక్కజొన్న.. ఇతర పంటలు ఆరబెట్టవద్దు

**నిజామాబాద్ జిల్లా మన దునియా:**




: నిజామాబాద్ జిల్లా పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు,జక్రాన్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రైతులు రహదారులపై మొక్కజొన్న, వరిధాన్యం ఇతర పంట ఉత్పత్తులను ఆరబెట్టవద్దని ఎస్సై మహేష్ సూచించారు. రహ దారులపై వాహనాల రాకపోకలు నిరంతరం కొనసాగుతుంటాయని, రోడ్లపై పంటలను ఆరబెట్టడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు కలగడంతో పాటు రోడ్డు ప్ర మాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రహదారులపై పంటలు ఆరబెట్టడం వాహనదా రులకు ప్రమాదకరంగా మారుతుందన్నారు. రహదారులపై పంటలు ఆరబెట్టడం వల్ల ప్రమా దాలు జరిగి అమాయకుల ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడవచ్చన్నారు. రైతులందరూ తమ పంటలను రహదారులపై కాకుండా సురక్షితమైన ప్రదేశాల్లో మాత్రమే ఆరబెట్టాలని, ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్సై కోరారు. రహ దారులపై పంటలను ఆరబెట్టి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టప్రకారం చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. రోడ్డు ప్రమాదాల నివారణకు రైతులు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు.

మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 13, 2026

# గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి

## పెంబి ప్రీమియర్ లీగ్ సీజన్ - 5 క్రికెట్ పోటీలను ప్రారంభించిన భూక్యా జాన్సన్ నాయక్





**ఖానాపూర్ ఆర్సి మన దునియా; అక్టోబర్ 12:**

పెంబి: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పెంబి ప్రీమియర్ లీగ్ (ప్రా) సీజన్--5 క్రికెట్ పోటీలను బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మైదానానికి చేరుకున్న ఆయనకు నిర్వాహకులు, క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా భూక్యా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలని అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారులకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు కల్పిస్తే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిలో క్రీడలను భాగం చేసుకోవాలని సూచించారు.పెంబి ప్రీమియర్ లీగ్ వంటి పోటీలు యువ క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని అన్నారు. టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ, క్రీడాకారులందరూ ఐకమత్యంతో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు.

# పుష్కరాల పనులు వేగవంతంగా చేపట్టాలి

## రాష్ట్ర దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్

**నిజామాబాద్ జిల్లా. మన దునియా ప్రతినిధి:**

గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సూచించారు. సోమవారం సాయంత్రం గోదావరి పుష్కరాల పనుల నిర్వహణపై దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి ఆమె సంబంధిత జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుష్కరాల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పనులు చేపట్టేందుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాల వారిగా చేపట్టిన పనుల వివరాలు సమీక్షించారు. దేవాదాయ, నీటిపారుదల, ఆర్ అండ్ బి, పర్యాటక, తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టవలసిన పనులపై కీలక సూచనలు చేశారు. పనులు ప్రారంభించేందుకు ఏవైనా అనుమతులు పొందాల్సివుంటే వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పారు.నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం, ఘాట్ల మరమ్మతులు, రోడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, తదితర నిర్మాణాల పనులు గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు.కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలోని కందకుర్తి, యంచ తదితర గోదావరి పరీవాహక పుణ్యక్షేత్రాల వద్ద పుష్కరాలు నిర్వహించే అన్ని ప్రాంతాల్లో పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. ప్రముఖులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న కందకుర్తి పుణ్యక్షేత్రం వద్ద పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ భుజంగరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ములుగులో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనానికి బీజేపీ మహిళా మోర్చా యత్నం

## మహిళలపై వేధింపుల ఆరోపణలున్న ఎంపీపై చర్యలు తీసుకోవాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం డిమాండ్






**ములుగు జిల్లా:అక్టోబర్ 12**

ములుగు జిల్లా కేంద్రంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కొర్ర సుమలత ఆధ్వర్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ అంగోంచా బీమల్ అకౌజంపై 11 మంది బాలికలు, మహిళలకు సంబంధించిన లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయని పేర్కొంటూ, ఈ వ్యవహారంపై రాహుల్ గాంధీ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

**ఎంపీని సస్పెండ్ చేయాలి**

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ, మహిళలపై వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీపై కాంగ్రెస్ పార్టీ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఎంపీని సస్పెండ్ చేసే వరకు జిల్లా, రాష్ట్ర, దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు.

**మహిళా పోలీసుల పట్ల ప్రవర్తనను ఖండించిన బీజేపీ**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ నాయకులు చేపడుతున్న ధర్నాలు, ర్యాలీల సందర్భంగా మహిళలు, మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారంటూ బీజేపీ నాయకులు విమర్శించారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పే కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్ రావు, ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, కోశాధికారి గంగిశెట్టి రాజ్ కుమార్, కార్యాలయ కార్యదర్శి సూర్యదేవర విశ్వనాథ్, మండల అధ్యక్షుడు రాయంచు నాగరాజు, మహిళా మోర్చా నాయకులు బానోత్ నిర్మల, గోపు రజిత, ఇరూప స్వరూపతో పాటు పలువురు మహిళా మోర్చా నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోర్తాడ్‌లో హోరెత్తిన ఈవీఎం హటావో-దేశ్ బచావో' నినాదం!

**నిజామాబాద్ జిల్లా ::మన దునియా :**

మోర్తాడ్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన ధర్నా నిర్వహించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న దేశవ్యాప్త నిరసనకు మద్దతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. అట్టి న్యాయమైన డిమాండ్ కోసం విద్యార్థి లోకం మహిళలు, సామాన్య పౌరులు చేపట్టిన నిరసనలో అనేక మందిని డిటెన్ చేయడం అప్రజాస్వామికం. అనేక నిరసనకారులపై విధించిన అక్రమ కేసుల్ని తక్షణమే రద్దు చేయాలని కోరారు. నిరసన తెలపడం రాజ్యాంగం కల్పించిన హక్కు, దానిని కాలరాయడం కేంద్ర ప్రభుత్వం తీరు సరైనది కాదని విమర్శించారు. శాంతియుత వాతావరణం కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మరోవైపు ఓట్ చోరికి మూల కారణం ఈవిఎం మెషీన్ కావున లిఈవిఎం హటావో దేశ్ బచావో" అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు అంగుళి మాలజీ, డీఎస్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కాన్సిరాం మాల, జాంబవ చమార్, కాశీరాం మైనారిటీ యువకులు పాల్గొన్నారు.



# రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నేతలు!

## ఎరువుల కొరత, విద్యుత్ కోతలతో రైతులకు ఇబ్బందులు..

## ఎండుతున్న పంటలకు పరిహారం చెల్లించాలి

## బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

## కొందుర్గులో బీఆర్ఎస్ మీడియా సమావేశం..

## రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు



**మన దునియా,రంగారెడ్డి జిల్లా కొందుర్గు:అక్టోబర్ 12**

రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎండిపోతున్న పంటలు, విద్యుత్ కోతలు, ఎరువుల కొరత తదితర అంశాలపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని జి.ఎం. పటేల్ మినీ గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాల కొరత, విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు ఎండిపోతున్నా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన ఉపశమన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తెలంగాణ నదీ జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకుపోతున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.షాద్‌నగర్ ఎమ్మెల్యే తెలంగాణ ఉద్యమకారుల పట్ల, తెలంగాణ జాతిపితగా తాము భావించే కేసీఆర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, మరోవైపు బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌ను అరెస్టు చేసి, దుస్తులు విప్పించి జైలుకు పంపించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో పోలీసుల వ్యవహారశైలిపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు పెరిగాయని, ప్రజలు ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని అన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టాలని, పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఎండిన పంటలను పరిశీలించి రైతులకు పరిహారం అందించాలిమాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువుల కొరత, విద్యుత్ కోతలు, ఎల్‌నినో ప్రభావం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుబంధు పథకం అమలుపైనా విమర్శలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను సందర్శించి, ఎండిపోయిన పంటలను పరిశీలించి, నష్ట వివరాలతో నివేదికలు రూపొందించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని అంజయ్య యాదవ్ విమర్శించారు. ప్రభుత్వం మిగిలిన కాలంలోనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నె కవిత నారాయణ యాదవ్, బీఆర్ఎస్ మండల, మున్సిపల్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, హఫీజ్, నటరాజన్, లక్ష్మణ్ నాయక్, మాజీ జడ్పీటీసీ బంగారు రాములు, మాజీ ఎంపీపీ తనయుడు పోతురాజు గోపాల్, సర్పంచులు మోహనచారి, సోని శేఖర్, నాయకులు కొండి యాదయ్య, వెంకటేష్, సత్య ప్రమోద్ పంతులు, దానగల్ల రాములు, ఆకుల మానయ్య, రెడ్డి నర్సింలు, దర్గా రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు..

మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 13, 2026

# కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

**నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు,**

**అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న విష్ణువర్ధన్ రెడ్డి**

**మన దునియా,షాద్‌నగర్:అక్టోబర్ 12**

షాద్‌నగర్ పట్టణంలోని కోట మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన దసరా నవరాత్రి ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తన సతీమణి రమాదేవి, తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి పర్వదినాల్లో అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు మన సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలని, ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భక్తులందరూ ఐకమత్యంతో పండుగలను నిర్వహించుకోవడం మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతుందని అన్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు పేదలకు, భక్తులకు తోడ్పాటునందించడంతో పాటు సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపతో ప్రజల జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యం వెల్లివిరియాలని, షాద్‌నగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, విజయ భాస్కర్, మోహన్ సింగ్, సుధాకర్ అప్ప, చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, వంశీకృష్ణ, లష్కర్ నాయక్, శ్యాంసుందర్ రెడ్డి, మఠం రిషికేష్, కృష్ణ యాదవ్, గంగాధర్, శ్రీనివాస్ చారి, అనిల్ కుమార్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, చౌడం శ్రీనివాస్‌తో పాటు భవానీ దీక్షాదారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..



# నా కొడుకు బతికున్నాడా.. లేడా?





**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

**బాన్సువాడ, అక్టోబర్ 12 :**

ఉపాధి కోసం రష్యాకు వెళ్లి అక్కడి సైన్యంలో చేరాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన నలుగురు యువకుల వ్యవహారం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వీరిలో కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తాడుకోల్ గ్రామానికి చెందిన మహమ్మద్ అఫ్జల్ ఖాన్ (43) మృతి చెందినట్లు జాతీయ మీడియాలో వార్తలు రావడం కలకలం రేపుతోంది. అయితే ఆయన మృతిపై భారత రాయబార కార్యాలయం నుంచి అధికారిక ధ్రువీకరణ అందకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

**వాయిస్ మెసేజ్‌తో కలకలం**

ఈ ఏడాది ఫిబ్రవరి 13న ఉపాధి కోసం అఫ్జల్ ఖాన్‌తో పాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన మరో ముగ్గురు యువకులు రష్యాకు వెళ్లారు. వీరిలో బాధితుడైన సిర్షు అశోక్ రష్యాలోని అడవుల నుంచి తన భార్యకు పంపిన వాయిస్ మెసేజ్‌లో అఫ్జల్ ఖాన్ మృతి చెందినట్లు తెలిపినట్లు సమాచారం. "అఫ్జల్ ఖాన్ చనిపోయి వారం రోజులైంది. యుద్ధంలో చనిపోయాడు. నేను కూడా అడవుల్లో బిక్కుబిక్కుమంటూ తిరుగుతున్నాను" అని అశోక్ చెప్పినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఈ సమాచారం బాధిత కుటుంబాల్లో తీవ్ర ఆందోళనకు కారణమైంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన నలుగురు యువకుల్లో ఇద్దరు మొదటి విడతగా 50 మంది సైనికుల బృందంతో వెళ్లగా, మరో ఇద్దరు వేరే బృందంతో వెళ్లినట్లు తెలుస్తోంది

**బాధిత కుటుంబంలో ఆందోళన**

అఫ్జల్ ఖాన్ మృతి చెందినట్లు వస్తున్న వార్తలపై స్పష్టత కోసం ఆయన తండ్రి అబ్బాస్ ఖాన్, భార్య, ఇతర కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంతో పాటు ఎంపీ ధర్మపురి అరవింద్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లా ఖాన్ ద్వారా సహాయం కోరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు తమకు ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన మన ప్రతిభావంతులు....

## స్వర్ణం, రజిత కాంస్యం, కైవసం

**పట్టుదల కఠోర శ్రమతో అద్భుత ప్రదర్శన**

**పోటీలో హోరాహోరీగా తలపడి పథకాలు సాధించిన క్రీడాకారినులు**

**స్థానికంగా సర్వత్ర అభినందలు వెల్లువ**

**మన దునియా వాజేడు అక్టోబర్ 12**

రాష్ట్రస్థాయిలో ఇటీవల జరిగిన ప్రతిష్టాత్మక క్రీడా పోటీల్లో ములుగు జిల్లా వాజేడు మండలం పెద్ద గొల్లగూడెం పాఠశాల విద్యార్థినిలు అద్భుత ప్రతిభ కనబరిచారు వివిధ భాగాల్లో జరిగిన హోరాహోరీ మ్యాచ్లలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఒక స్వర్ణ పతాకం మరియు ఒక కాంస్యం పతాకం, రజిత, జిల్లా ప్రాంతం గర్వించేలా విద్యార్థినిలు సాధించారు ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ బాల బాలికల ఛాంపియన్ షిప్ 11 -10 -2026లో జరిగిన క్రీడాలలో ఏ జి హెచ్ ఎస్ పెద్ద గొల్లగూడెం పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచి పథకాలు సాధించారు ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థునిలు మూడు పథకాలు సాధించి పాఠశాలకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలిచారు ముగిసిన పోటీల్లోఎ స్వర్ణం లాంగ్ జంప్ లు రజితం ట్రయాథ్లాన్ బి లో కాంస్యం సాధించారు

**విజేతలు**

అక్షర, స్వర్ణ పథకం, ట్రయాథ్లాన్ ఎ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పథకాన్ని సాధించింది హర్షిని , రజిత పథకం , లాంగ్ జంపులు పోటీలో ప్రతిభ కనబరిచి రెండో స్థానంలో నిలిచి పథకాన్ని కైవసం చేసుకుంది

**హర్షిత, కాంస్య పథకం**

ట్రాయాథ్లాన్ బి విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కౌంస్యపథకాన్ని సాధించింది విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీల్లో పథకాలు సాధించడం పట్ల ఏ జి హెచ్ ఎస్ పెద్ద గొల్లగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇర్ప కేశవరావు, తోటి ఉపాధ్యాయులు పూణేమ్ రోజా రాణి,పాయం తిరుపతమ్మ,పెండకట్ల బుచ్చిబాబు ,తోళెం కృష్ణయ్య, కోడే భారతి, యలం ఉమాదేవి, సృజన, గౌతమి ధనలక్ష్మి కుమారి కవిత ఫిజికల్ డైరెక్టర్ గుండ్ల రాజు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు విద్యార్థినుల విజయానికి కృషిచేసిన ఫిజికల్ డైరెక్టర్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఈ సందర్భంగా వారిని అభినందించారు విద్యార్థుల్లో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం పట్టుదల పెంపొందించాలని పేర్కొన్నారు విద్యార్థినిలు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు ఏ జి హెచ్ ఎస్ పెద్ద గొల్లగూడెం పాఠశాల కు క్రీడాకారులు మారుమూల ప్రాంతం నుంచి రాష్ట్రస్థాయిలో విజయాన్ని సాధించినందుకు పాఠశాల ఉపాధ్యాయులు ఆ ప్రాంత ప్రజలు విద్యార్థులను మరియు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఫిజికల్ డైరెక్టర్ అభినందించారు




# పెండింగ్ బిల్లులు చెల్లించాలి.. పండుగ పూట పస్తులుంచొద్దు!

**బతుకమ్మ ఆడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన.. కలెక్టరేట్ ఎదుట ధర్నా**









**మన దునియా ;అక్టోబర్ 12:**

మంచిర్యాల: పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట కార్మికులు ఆందోళన చేపట్టారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి రాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రతి నెలా అందాల్సిన వేతనాలు, బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా పండుగ వచ్చినా జీతాలు, బిల్లులు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. పండుగను కుటుంబాలతో ఎలా జరుపుకోవాలని, పిల్లలకు ఏమి తినిపించాలని, నిత్యావసర సరుకులు ఎలా కొనుగోలు చేయాలని ప్రశ్నించారు. కార్మిక కుటుంబాలను పస్తులుంచే పరిస్థితికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఐటీయూ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దాగం రాజారాం మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వాలు పరిష్కరించడం లేదన్నారు. 60 ఏళ్లు పైబడిన కార్మికులను తొలగించాలనే నిర్ణయం అన్యాయమని, ఇన్నేళ్లు సేవలు అందించిన వారిని తొలగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి కార్మికురాలికి రూ.2 లక్షల రిటైర్మెంట్ ప్రయోజనం కల్పించాలని, కోడిగుడ్లు, గ్యాస్‌ను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, బీమా తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.డి. కరీమా, ఎం.డి. రఫియా, జిల్లా కోశాధికారి సవిత, జిల్లా ఉపాధ్యక్షులు మధునమ్మ, రబియా, సహాయ కార్యదర్శులు రమాదేవి, సరిత, జ్యోతితో పాటు జిల్లాలోని పలువురు మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

# ప్రతీ ఒక్క ప్రైవేట్ టీచర్ ఎమ్మెల్సీ ఓటును నమోదు చేసుకోవాలి! టిపిటిఫ్ విజ్ఞప్తి

**మన దునియా,హనుమకొండ:అక్టోబర్12**




హనుమకొండ: రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రైవేట్ టీచర్స్ యొక్క పాత్ర ఎంతో కీలకం అని గుర్తు చేస్తూ, ప్రతీ ఒక్క ప్రైవేట్ ఉపాధ్యాయులు ఓటు ను నమోదు చేసుకోవాల్సిన బాధ్యత, ఓటు హక్కును వినియోగించుకుని , సమాజం లో ప్రైవేట్ ఉపాధ్యాయుల సంఖ్య ,పాత్ర ఎంతో ఉందనీ, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు చంద్రగిరి సునిల్ కుమార్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ గత ఎన్నికల్లో అన్ని ప్రభుత్వాల హామీలతో విసిగి చెందామని, మా ప్రైవేట్ టీచర్లకు హెల్త్ కార్డ్, ఇన్సూరెన్స్ కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిన వాళ్ళకే మా మద్దతు ఉంటుందని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధం లేని ఎన్నికలు కాబట్టి, ఎలాంటి రాజకీయ పార్టీల తో మాకు సంబంధం,అనుబంధం లేని, ఒక కమిట్మెంట్ సంస్థ టీపీటీఎఫ్ అని, రానున్న ఎన్నికల్లో ప్రైవేట్ టీచర్స్ యొక్క సత్తా, సామర్థ్యం చూయించగలం అని, చూపిస్తాం అని ధీమా వ్యక్తం చేసారు. దసరా సెలవుల్లో ఉపాధ్యాయులకు క్లాస్ లు,అని వర్క్ షాప్ పేరుతో , పండుగకు సెలవులు ఇవ్వకుండా వేధిస్తున్నారని మా దృష్టి కి వస్తుందని, ఇప్పటికైన యాజమాన్యాలు ఇలాంటి వేధింపులకు పాల్పడకుండా, తెలంగాణ లో బతుకమ్మ పండుగ అంటే ఒక ప్రత్యేకత ఉందని,ఉంటుందని, సెలవు లు ఇవ్వకుండా,మహిళా ఉపాధ్యాయులను వేధిస్తే, జిల్లా అధికారుల దృష్టి కి తీసుకెళ్లి, ఆ పాఠశాల గుర్తింపు రద్దు చేసే విధంగా, టీపీటీఎఫ్ తరపున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశం లో టిపిటిఫ్ నాయకులు పాల్గొన్నారు.

మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 13, 2026

# మాతా శిశు ఆసుపత్రిలో నాలుగు రోజుల శిశు మరణం పై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

## ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి కాల్వ శ్రీనివాస్ యాదవ్

**మన దునియా,కరీంనగర్:అక్టోబర్ 12**

కరీంనగర్ నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల నాలుగు రోజుల పసికందు మృతి చెందిందని దీనిపై విచారణ వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాకు ఈరోజు ఏ ఐ వై ఎఫ్ నాయకులు వినతి పత్రం అందించారు.

సందర్భంగా ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి కాల్వ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు చుట్టంలాగా వచ్చి వెళ్ళిపోతున్నారని సమయానికి ఉండకపోవడం ఇలాంటి సంఘటన జరుగుతున్నాయని వారుఆరోపించారు. మాతా శిశు ఆసుపత్రిలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో అందులోని ట్రైనింగ్ విద్యార్థులతో వైద్యం అందిస్తున్నారని ఈ కారణం వల్లేనాలుగు రోజుల పసికందు మృతి చెందిదని ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. మాతా శిశు ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్యులు, ఆసుపత్రి అధికారులపై ఉందని అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సమయానికి అందుబాటులో లేకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం, సమయపాలన పాటించకపోవడం వంటి కారణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇటీవల మాతా శిశు ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడం, వైద్య సేవల్లో నిర్లక్ష్యం జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో కేవలం నాలుగు రోజుల పసికందు మృతి చెందడం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోందని ఈ ఘటనపై బాధిత కుటుంబానికి న్యాయం జరగాల్సిన అవసరం ఉంది. వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండి, అవసరమైన వైద్య సేవలు అందించి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదనే అంశంతో పాటు, ఈ ఘటనకు దారితీసిన కారణాలను సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నాం మాత శిశు ఆసుపత్రిలో పసికందు మృతి ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని,. ఘటన జరిగిన సమయంలో విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి వైద్యుల నిర్లక్ష్యం లేదా విధుల్లో



అలసత్వం ఉన్నట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.మాతా శిశు ఆసుపత్రి వైద్యులు నిర్దేశిత సమయాల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి అత్యవసర పరిస్థితుల్లో నవజాత శిశువులకు తక్షణ వైద్యం అందేలా తగిన వైద్యులు, సిబ్బంది, అవసరమైన వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ ఆదుకోవాలని వారు కోరారు. ఈ వినతి పత్ర సమర్పణలో ఏఐవైఎఫ్ నగర్ సహాయ కార్యదర్శి జువ్వాజి తిరుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ అధికారి నిబంధనలతో ఉన్న హెచ్చరిక లను లెక్కచేయని మట్టి మాఫియా

**మన దునియా,జోగులాంబ గద్వాల జిల్లా:అక్టోబర్ 12**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణ కేంద్రం ఈ పట్టణ కేంద్రం నకు కూతవేటు దూరం లో ఉన్న గద్వాల మండలం వీరపురం గ్రామం నుండి కొందరు అక్రమంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తరలించడం జరుగుతుంది. సెలవు దినము అయినప్పటికీ వీరి అక్రమ మట్టి తరలింపుకు అడ్డు అదుపు లేకుండా పోతుంది, జూలై మాసం లో గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ షేక్ బాషా, సంబంధిత రెవిన్యూ, మైనింగ్, పోలీస్ అధికారుల సమక్షంలో జిల్లా లో మట్టి. ఇసుక తరలింపు కోసం మైనింగ్, రెవిన్యూ అధికారుల నుండి అనుమతులు తీసుకొని మట్టి, ఇసుక తరలించడం చేయాలి అలా లేని పక్షంలో నిబంధనలు ఉల్లంగించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకొనబడును అని మీటింగ్ హాల్ లో సమావేశపరిచి హెచ్చరికలు జరిచేయడం జరిగింది. కాని అ మాటలు. నిబంధనలు హెచ్చరిక లు కలెక్టర్ కార్యాలయం లో ఉన్న మీటింగ్ హాల్ వరకే పరిమితం అవుతున్నాయి అని ఆరోపణలు వినబడుతున్నాయి. ప్రతి రోజు ఎదో విదంగా అక్రమంగా మట్టి తరలించడం జరుగుతుంది. ఏకంగా రూరల్ పోలీస్ స్టేషన్ ముందు మరియు కలెక్టర్ ఆఫీస్ ముందుగా నే వెళుతున్నాయి అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. రెవెన్యూ మరియు మైనింగ్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందిస్తారా లేదు వేచి చూడాల్సిందే.





# రబీ సీజన్ లో ప్రభుత్వము రైతాంగాన్ని ఆదుకోవాలి

**రైతాంగ సమస్యల పరిష్కారం కొరకై ఈరోజు జిల్లా కలెక్టర్ వినతి పత్రం**

**అందజేసిన విజ్ఞప్తి చేశారు**

**ఏఐకేఎంఐ జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య**

**నిజామాబాద్ జిల్లా మన దునియా:**

ఈ సందర్భంగా రాష్ట్రమంతటా ఎల్.ని. నో ప్రభావం వల్ల రైతులు వేసుకున్న పంటలు కొన్ని ప్రాంతాలలో ఎండిపోయినవి. మన జిల్లాలో అంత తీవ్రంగా లేకపోయినా చేతికి వస్తున్న పంటను కాపాడేందుకు నీళ్లందకా కరెంటు కోతల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని భూమయ్య అన్నారు పగటిపూటనే 12 గంటల కరెంటును సప్లై చేయాలి . అవసరమైతే గుత్ప, ఆలీసాగర్, లిఫ్టుల ద్వారా నీటిన విడుదల చేయాలి. రైతులకు ముందుగా అధికారులు చెప్పిన విధంగా రబి లో ఆరుతడు పంటలకు వెళ్లాలని అన్నారని ఇప్పుడేమో ప్రభుత్వం వద్దంటుంది అని వారు అన్నారుకనీసం బోర్ల వద్ద, చెరువుల వద్ద, కొద్దిమేర కైనా ఆరుతడి పంటలకు అనుమతిని ఇవ్వాలని భూమయ్య అన్నారు మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు, [illegible] మినుములు, తదితర పంటలకు విత్తనాలు ఎస్సీ ఎస్టీ రైతులకుఉచితంగా మిగిలిన రైతులకు 80 శాతం సబ్సిడీతో అందించాలి. చెరుకు పంట కూడా ఆరుతడి పంట అయినందున చీజాఖీ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి రైతులకు చెరుకు పంట వైపు మళ్ళించాలి యంత్ర లక్ష్మీలో 80% సబ్సిడీలు యంత్రాలను రైతులకు అందించి వారిని సాగు వైపు ప్రోత్సహించాలి. పాత రుణాలు రీ షెడ్యూల్ చేసి కొత్తగా రైతులకు రుణాలు, ఎరువులు, విత్తనాలు, అందించాలి. పశుగ్రాసము కొరతను నివారించేందుకుగాను గడ్డి విత్తనాలను 80% సబ్సిడీతో రైతుకు అందించి పాడి పశువులను కాపాడాలని పశువులను, గొర్రె మేకలను కాపాడాలి మధ్యలో ఆగిపోయిన మంచి 21వ ప్యాకేజీ పనులను తగిన నిధులు కేటాయించి సత్వరమే పనులను ప్రారంభించి పూర్తి చేయాలి ఈ ప్యాకేజీ కింద నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని 7 మండలాలు 77 గ్రామాలలో తాండలకు కలిపి 84 వేల ఎకరాలకు పంట సాగుకు నీరు అందించవచ్చు ఇప్పటికైనా ఎండిన పంటలు ఉంటే ఆ





రైతు పంటను పరిశీలించి నష్టపరిహారం ఎకరానికి 35 వేల రూపాయలు అందించాలి ఇప్పటికే రైతు చేతికి వచ్చిన ధాన్యం వడ్లను నిలువ చేసుకొనేందుకుగాను గోదాములను కేటాయించి అట్టి దాన్యంపై 80% రుణం అందించాలని మా అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ తరపున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయిరెడ్డి, కె. గోపాల్, అగ్గు చిన్నయ్య, రాపాని గంగాధర్, బి. సాయిలు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు

# రక్తదానంతో ఆదర్శంగా ప్రశాంత్ గౌడ్ 12వసారి రక్తదానం

**సేవ చేయడానికి పదవులు అవసరం లేదు**

**రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు**

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

కామారెడ్డి జిల్లా రెడ్డి పెట్ గ్రామానికి చెందిన ప్రశాంత్ గౌడ్ 12వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలవడం జరిగిందని రెడ్ క్రాస్ జిల్లా సమన్వయ సభ్యులు డాక్టర్ బాలు తెలియజేశారు.ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందజేయడం కోసం సంవత్సరంలో మూడు సార్లు రక్తదానం చేస్తూ నేటి యువతకు ఆదర్శంగా నిలవడం జరిగిందని అన్నారు.రక్తదానం పట్ల ఉన్న అపోహలను విడనాడాలని సూచించారు. రక్తదానం చేసే రక్తదాతలకు గుండె జబ్బులు,క్యాన్సర్, కొలెస్ట్రాల్ వంటి సమస్యలను తగ్గించుకోవచ్చు అనే విషయాన్ని తెలుసుకుని రక్తదానానికి ముందుకు రావాలని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రక్తదానం పైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని,సేవ చేయడానికి పదవులు అవసరం లేదని కొందరు మాత్రం పదవులను పొందడం కోసమే రెడ్ క్రాస్ లోకి రావడం జరిగిందని, వీరి వల్ల సమాజానికి ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు.తల సేమియా బాధితుల కోసం మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తం అందజేయడానికి సిద్ధంగా ఉంటామని అన్నారు. రక్తదాత ప్రశాంత్ గౌడ్ కు అభినందనలు తెలియజేశారు.




# వన్యప్రాణులకు నీటి తొట్టెలు ఏర్పాటు చేయండి.

## దాహం దాహం అంటూ విలవిలవ ఆడుతున్న మూగ జీవాలు..

**త్రాగునీటి సమస్యపై ప్రత్యేక కథనం మన దునియా: డెస్క్:**

మన దునియా కెమెరాకు చిక్కిన వన్యప్రాణుల తన పిల్లలకు త్రాగటానికి నీరు లేక అల్మటిస్తున్న తల్లి చివరికి బోర్ పంపు ఎంతగానో ఎంత మాత్రం నీరు రాలేదు.. ఇకనైనా మూగజీవాలకు పక్షులకు వెంటనే స్పందించి మూగజీవాలను జంతు ప్రేమికులు కోరుకుంటున్నారు. నీరు నీ వృధా చేయకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తే ప్రతి గ్రామాల్లో మూగజీవాలకు త్రాగునీరు అందుతుందని ఇంకుడు గుత్త ఏర్పాటు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించారు. కానీ ఆచరణలో శూన్యం. మేధావులు రాజకీయ విశ్లేషకులు వెంటనే స్పందించి మూగజీవాలకు సంరక్షణకు యుద్ధ పాతిపతంగా మూగ జీవాల కోసం నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.



# కార్మికులకు ఐఎన్టియుసి ద్వారానే న్యాయం

**మన దునియా, అక్టోబర్ 12,మంచిర్యాల జిల్లా**

సింగరేణి కార్మికులకు ఐ ఎన్ టి యు సి ద్వారానే న్యాయం జరుగుతుందని కార్మికులంతా ఏకమై ఐ ఎన్ టి యు సి ని బలపరచాలని నాయకులు కోరారు.జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సింగరేణి లో జరిగే పరిణామలకు ఐ ఎన్ టి యు సి ప్రధాన పాత్ర వహిస్తుందని పది సంవత్సరాలనుండి టి ఆర్ ఎస్ పార్టీ కార్మికులకు చేసిందేమిలేదని సింగరేణి ప్రయివేటికరణకు మద్దతు తెలిపారో దాన్ని అదిగామించి మంత్రి శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల మంత్రులు ఏకమై ఢిల్లీ వెళ్లి ఎన్నో కొత్త మైన్లు తీసుకొని వచ్చారని, టీఆరెవెస్, టి బి జి కె ఎస్, ఏ ఐ టి యు సి, దొంగ పొత్తు పెట్టుకొని ఐ ఎన్ టి యు సి ని తప్పుదోవ పెట్టించడానికి ప్రయత్నం చేస్తున్నారని, సింగరేణి కార్మికులు అన్ని గమనిస్తున్నారని, గత ఎన్నికల్లో దొంగ పొత్తు పెట్టుకొని పోటీ చేశారాని కార్మికులు గమనించగలరు అని, కార్మికుల కు న్యాయం ఐ ఎన్ టి యు సి ద్వారానే జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంపెల్లి సమ్మయ్య సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, రాంశెట్టి నరేందర్ చీఫ్ సెంట్రల్ ఆర్గనైజషన్ సెక్రటరీ, దేవి బీమయ్యా ఏరియా వైస్ ప్రెసిడెంట్ మందమర్రి, పేరం శ్రీనివాస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ బెల్లంపల్లి, డి, శంకర్ రావు సెంట్రల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ, కే ఓదెలు తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 13, 2026

# పిల్లల్లో పెండింగ్ టీకాలను, రక్తహీనతను తగ్గించండి





**నిజామాబాద్ జిల్లా: మన దునియా ప్రతినిధి:**



నిజామాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లోని, వ్యాధి నిరోధక టీకాలు, రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం, మరియు ఎస్ఎన్ సియు విభాగాల సిబ్బంది సమీక్షించారు. ప్రతినెల బుధ మరియు శనివారాల్లో జరగాల్సిన జననీ సెషన్స్ ఎన్ని పెండింగ్ ఉన్నాయి. యువిన్ లో ఎన్ని ఇంకా ఎంట్రీ చేయలేదు ప్రతిరోజు ఫాలో అప్ చేయాలన్నారు. పీహెచ్సీలలో ఉన్న ఉప కేంద్రాలు 225 మరియు యూపీహెచ్సీలలో ఉన్న 50 ఉప కేంద్రాలలో బుధవారము మరియు ప్లానింగ్ చేసిన శనివారాలలో జనని సెషన్లను నిర్వహించాలని. అదేవిధంగా ప్రతి బుధవారము పీహెచ్సీలు, సిహెచ్సిలు, యూపీహెచ్సీలలో కూడా సెషన్స్ నిర్వహించాలన్నారు. ప్రతివారం సేషన్ కు ఒక రోజు ముందు మంగళవారం మరియు శుక్రవారం యాంటిజెన్ డోస్ లా వారి డ్యూ లిస్టును, పీహెచ్సీవైజు జిల్లా ఏఎన్ఎం గ్రూపు నందు పోస్ట్ చేయాలని ఆదేశించారు తద్వారా ఆయా ఉప కేంద్రాల ఏఎన్ఎంలు వెంటనే స్పందించి లో ఉన్న వారిని ఆశాల ద్వారా సెషన్కు వచ్చేలా చూస్తారనీ అన్నారు. యూఐపీ విభాగంలో ఉన్న ముగ్గురు సిబ్బంది ఒక్కొక్కరు ఒక డివిజన్ ను పెంచుకొని అన్ని రకాల పనులను పర్యవేక్షించాలన్నారు. రిఫ్రిజిరేషన్ మెకానిక్ అన్నిపీఎస్సీలను క్రమం తప్పకుండా సందర్శించాలన్నారు ఎక్కడ సమస్య రాకుండా చూడాలన్నారు. అదేవిధంగా డైలీ టూర్ డైరీ ని సమర్పించాలని ఆదేశించారు. స్టాఫ్ నర్సులు ఎవరికైనా టీకాలు ఇవ్వడం రాకపోతే నేర్చుకోవాలని ప్రతి పి ఎస్ సి, సి ఎస్ సి, యు పి హెచ్ సి ల లో టీకాలు ఇవ్వాలన్నారు. జి జి హెచ్ లోని ఎన్ఆర్సి లో సామ్ మామ్ పిల్లలను గుర్తించి వారికి పోషక ఆహారాన్ని, చికిత్సను అందించాలని, అన్నారు. ఎస్ ఎన్ సి యు లో అడ్మిట్ అయిన పిల్లల ఆరోగ్యాన్ని కాపాడాలని అన్నారు. లామా కేసులన్నింటినీ ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ ద్వారా మోటివేషన్ చేయాలన్నారు, ఎన్ ఆర్ సి లో ఉన్న రికార్డుల ప్రకారం సామ్ పిల్లల జాబితా ఉండాలన్నారు. ఆర్ బి ఎస్ కే మొబైల్ టీం ల ద్వారా పాఠశాలల్లో కానీ అంగన్వాడీ సెంటర్లలో కానీ ఏ ఒక్క విద్యార్థి కూడా రక్తహీనతతో బాధపడకుండా చికిత్స అందించాలని అవగాహన కలిగించాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ అశోక్, ఎస్ ఎన్ సి యు పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ నిరూపరెడ్డి, ఎన్ ఆర్ సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్స్ స్నిగ్ధ, ఎస్ ఓ రాజేశ్వర్, ఫార్మసీ అధికారి నారాయణ, డి పి హెచ్ ఎన్ ఓ సరళ, డి హెచ్ ఈలు ఘన్పూర్ వెంకటేశ్వర్, మనోహర్, డిపిఓ విశాల, మేనేజర్ సచిన్, మమత, హెచ్ ఇ ఓ లు వెంకటరవి నాగరాజు, వినోద్ రఘు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## మహమ్మద్ గౌస్ పల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ముంజల కుమారస్వామి ఏకగ్రీవ ఎన్నిక

### కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం: నూతన అధ్యక్షుడు కుమారస్వామి

**మన దునియా,మల్లంపల్లి,అక్టోబర్ 11**





ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని మహమ్మద్ గౌస్ పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశాల మేరకు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో, మల్లంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి సలహా మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల ప్రశాంత్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు.

**నూతన గ్రామ కాంగ్రెస్ కమిటీ వివరాలు**

ఉపాధ్యక్షుడు: రొట్టె కిరణ్ప్రధాన కార్యదర్శి: ఉప్పు మహేందర్కార్యదర్శి: శ్రీపతి దేవేందర్వర్కింగ్ ప్రెసిడెంట్: తోట దేవేందర్కోశాధికారి: ఎం.డి. మైబుఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు పార్టీ నాయకులకు, గ్రామ పెద్దలకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముంజల కుమారస్వామి మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువగా వివరిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పసుల కార్తీక్ మాజీ సర్పంచ్ శైలజ సురేష్ గ్రామ సీనియర్ నాయకులు కార్యకర్తలు యూత్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

# నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి

### రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి.

**మన దునియా,ములుగు జిల్లా:అక్టోబర్ 12**





ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కానందున రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని అదనపు కలెక్టర్ రెవిన్యూ సి. హెచ్. మహేందర్ జి.తెలిపారు.సాగునీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకొని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని తెలిపారు.సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి పలువురు ఉన్నతాధికారులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లోని రైతు వేదికల్లో పాల్గొన్న సంబంధిత శాఖల అధికారులు, రైతులకువీడియో కాన్ఫరెన్స్ ద్వారాఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, సాగునీటి లభ్యత, ఆరుతడి పంటల సాగుపై దిశానిర్దేశం చేశారుఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రబీ సీజన్లో ఎట్టి పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయవద్దన్నారు. బిందు సేద్యంతో పామ్ తోటలు, కూరగాయలు వంటి స్వల్పకాలిక పంటలను సాగు చేయవచ్చున్నారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతలు, నీటి కుంటలు, బోర్వెల్స్ రీఛార్జ్, తదితర పనులను చేపట్టి జలవనరులను కాపాడుకోవాలన్నారు. రాష్ట్రంలో అధిక మండలాల్లో వర్షపాతం తక్కువగా ఉందని, ప్రభుత్వం త్వరలోనే కరువు మండలాలను ప్రకటిస్తుందన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా నీటిని పొదుపుగా వాడాలని సూచించారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాపై సరైన ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. భూగర్భ జల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు గ్రౌండ్ లెవెల్ నివేదికలను అందజేయాలన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ములుగు జిల్లాలోని 22 రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా పలు శాఖల అధికారులు, గ్రామస్తులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ను తిలకించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి హాజరయ్యారు.వీసి అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి రైతులు ఆరుతడి పంటలను సాగు చేయాలని తెలిపారు. ఎల్ నినో వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆరుతడి పంటల సాగుపై రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కలిగేందుకు విస్తృతంగా అన్ని మాధ్యమాల ద్వారా, కళాజాత బృందాలతో ప్రచార కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. రైతులు నష్ట పోకుండా ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కృషి చేస్తారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వర్షాభావ పరిస్థితులు, నీటి వినియోగం, ఆరుతడి పంటల సాగుపై క్షేత్రస్థాయిలో రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, డి ఆర్ డి ఓ రవీందర్, డి సి ఎస్ ఓ ఫైజల్ హుస్సేన్, డి ఎం డి సి ఎస్ ఓ క్రిష్ణ వేణి, డి ఎంహెచ్ ఓ గోపాలరావు, సి పి ఓ జవహర్, డిపి ఆర్ ఓ రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

## పలు బీఆర్ఎస్ నేతల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్

**హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/ఎల్కతుర్తి/ అక్టోబర్ 12మన దునియా,**

ఎల్కతుర్తి మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకుల కుటుంబ సభ్యులను హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ సోమవారం పరామర్శించారు. ఎల్కతుర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గ్రామ శాఖ అధ్యక్షుడు జంగం రాజు, సూరవరం వేమారెడ్డి, వీరనారాయణపూర్ గ్రామ బీఆర్ఎస్ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు సదరం రమేష్ కుటుంబ సభ్యులను ఆయన కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధాకర సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పోలా విశ్వనాథ్‌కు లయన్స్ క్లబ్ ఘన సన్మానం..

**సూర్యాపేట / నేరేడుచర్ల/ అక్టోబర్ 12 మన దునియా,**

వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన లయన్స్ క్లబ్ నేరేడుచర్ల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యుడు, చార్టర్ మెంబర్, సీనియర్ లయన్ పోలా విశ్వనాథ్‌ను క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సోమవారం సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ షేక్ యూసుఫ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, పోలా విశ్వనాథ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, సమాజ సేవలో తన సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. లయన్స్ క్లబ్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ మరింత గుర్తింపు పొందాలని కోరుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ కొనతం సీతారాం రెడ్డి, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ బట్టు మధు, ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మూలగుండ్ల వెంకటరెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యుడు బసవ కోటేశ్వరరావు, అడ్వైజరీ కమిటీ సభ్యుడు కొప్పు లక్ష్మీనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం



# మంత్రి సీతక్క విజ్ఞప్తికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం

## ములుగులో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణకు రూ.3 కోట్లు మంజూరు

## సానుకూలంగా స్పందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

**మన దునియా,ములుగు జిల్లా:అక్టోబర్ 12**

ములుగు నియోజకవర్గంలో ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తి మేరకు ఇంధన శాఖ ఈ నెల 8న ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 32 జారీ చేసింది.నివాస గృహాల మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భద్రతాపరమైన సమస్యలను మంత్రి సీతక్క ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రమాదాల ముప్పును తగ్గించేందుకు విద్యుత్ లైన్లను మార్చాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.మంత్రి సీతక్క విజ్ఞప్తికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం రూ.3 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ లైన్ల మార్పు, విస్తరణ పనులకు ఆమోదం తెలిపింది.ఆర్థిక శాఖ సమ్మతితో జారీ చేసిన ఈ ఉత్తర్వుల ప్రకారం పనుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.మంత్రి సీతక్క చొరవతో మంజూరైన ఈ నిధులతో విద్యుత్ లైన్ల మార్పు పనులు చేపట్టనున్నారు. పనులు పూర్తయితే ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లతో ఎదురవుతున్న ఇబ్బందులు తగ్గి, ప్రజలకు భద్రత పెరగనుంది. దీర్ఘకాలంగా ఉన్న



సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సీతక్కకు ములుగు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భూక్యా జాన్సన్ నాయక్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; అక్టోబర్ 12:**

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతి నగర్, ఇంద్రానగర్ కాలనీల్లో ప్రతిష్ఠించిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి మహోత్సవాల్లో భాగంగా ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భవానీ మాత ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. దుర్గాదేవి అమ్మవారి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మండప నిర్వాహకులను అభినందించారు.అనంతరం మండప నిర్వాహకులు భూక్యా జాన్సన్ నాయక్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టులు, పోలీసుల సమన్వయంతోనే సమాజ రక్షణ

## ఆర్మూర్ ఎస్.హెచ్.ఓ కొంగి చంద్రశేఖర్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

ఆర్మూర్ 12: జర్నలిస్టులు తమ విధులను పారదర్శకంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఆర్మూర్ సీఐ కె.చంద్రశేఖర్ రెడ్డి కోరారు.ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో జర్నలిస్టులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్.హెచ్.ఓ కొంగి చంద్రశేఖర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారుఈ సందర్భంగా సిఐ కె.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి జర్నలిస్టునూ వ్యక్తిగతంగా పలుకరిస్తూ పరిచయం చేసుకున్న సీఐ, పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు.. సమాజానికి తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్న మత్తు పదార్థాల రవాణా, వినియోగంపై సమాచారం అందిస్తూ మత్తు పదార్థాల నిర్మూలనకు పూర్తి స్థాయిలో సహకరించాలని జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు.క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువవుతూ 'ఫ్రెండ్లీ పోలీసింగ్'ను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.నిజామాబాద్ జిల్లా సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసం తాము నిరంతరం శ్రమిస్తామని తెలిపారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలోను, శాంతిభద్రతల రక్షణలోను ఆర్మూర్ సీఐతో పాటు సబ్-ఇన్స్పెక్టర్లు (ఎస్సైలు), పోలీస్ బృందం ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని సిఐ కె.చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో స్థానికఈ ఆత్మీయ సమ్మేళనంలో స్థానిక పోలీస్ అధికారులతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

## జుక్కల్‌లో ఘనంగా నియోజకవర్గ స్థాయి బతుకమ్మ సంబరాలు

## బతుకమ్మ సంబరాలకు ఆడపడుచులు భారీగా తరలిరావాలి

## ఎమ్మెల్యే తోట సతీమణి తోట అర్చన పిలుపు

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి :**

నిజాంసాగర్ (జుక్కల్) : తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని,నియోజకవర్గ స్థాయి బతుకమ్మ పండుగలోపాల్గొనేందుకు ఆడపడుచులందరూ తరలిరావాలనిజుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సతీమణి తోట అర్చనపిలుపునిచ్చారు. బతుకమ్మ పండుగనుపురస్కరించుకుని జుక్కల్ నియోజకవర్గ స్థాయిబతుకమ్మ సంబరాలను మంగళవారం జుక్కల్‌మండల కేంద్రంలోని గుండూర్ రోడ్డు వద్ద ఘనంగానిర్వహించనున్నట్లు జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీకాంతారావు సతీమణి తోట అర్చన తెలిపారు.మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈవేడుకలకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొనే మహిళలను ప్రోత్సహించేందుకు విజేతలకు నగదుబహుమతులు అందజేయనున్నట్లు అర్చనతెలిపారు. మొదటి బహుమతిగా రూ.51,000,రెండో బహుమతిగా రూ.25,000, మూడోబహుమతిగా రూ.11,000 అందజేయనున్నట్లువెల్లడించారు. అదేవిధంగా మరో ఎనిమిది మందికికన్సొలేషన్ బహుమతులు అందించనున్నట్లుపేర్కొన్నారు.ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అర్చన అన్నారు. ఈ పండుగ విశిష్టతను భావితరాలకు తెలియజేయడంతోపాటు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలనే ఉద్దేశంతో నియోజకవర్గ స్థాయి సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలోని ఆడపడుచులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని తోట అర్చన కోరారు. వేడుకలకు హాజరయ్యే వారందరికీ భోజన వసతి ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు.



# నంది గుట్టను మైనింగ్ నుంచి రక్షించాలి : కలెక్టర్‌కు బోడ మహేందర్ విజ్ఞప్తి

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి: మన దునియా**

నంది గుట్టపై మైనింగ్ నిర్వహిస్తే గుట్టకు, ఆలయాలకు, పరిసర పర్యావరణానికి నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు.నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం ముదక్‌పల్లి గ్రామ పరిధిలోని పవిత్రమైన నంది గుట్టను మైనింగ్ కార్యకలాపాల నుంచి రక్షించాలని కలెక్టర్‌ను ఓబీసీ సెల్ జిల్లా కోశాధికారి బోడ మహేందర్ నిజామాబాద్ జిల్లా కోరారు. నంది గుట్టపై, పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల పవిత్రతను కాపాడేందుకు అక్కడ ఎలాంటి మైనింగ్ అనుమతులు మంజూరు చేయవద్దని విజ్ఞప్తి చేశారు.

**నందిగుట్ట మీనింగ్ పలు ఆలయాల నిలయం..**

ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు సమర్పించిన వినతిపత్రంలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. ముదక్‌పల్లి గ్రామంలో నంది గుట్ట ప్రముఖమైన ఆధ్యాత్మిక ప్రదేశంగా ఉందని తెలిపారు. గుట్టపై అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి బేస్‌మెంట్, నాలుగు పిల్లర్లు నిర్మించారని, దీనికితోడు అక్కడ శివాలయం కూడా ఉందని పేర్కొన్నారు. గుట్టకు ఆనుకుని సుబ్రహ్మణ్య స్వామి, గణపతి ఆలయాలు ఉన్నాయని, గ్రామ ప్రజలు ఈ ఆలయాలను ఎంతో భక్తిశ్రద్ధలతో పూజిస్తారని వివరించారు.

**నందిగుట్ట మీనింగ్। మొరం తవ్వేందుకు ప్రయత్నాలు..**

అయితే, కొంతమంది నాయకులు నంది గుట్ట పక్కన ఉన్న అసైన్డ్ భూమిని లీజుకు తీసుకుని మైనింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని మహేందర్ తెలిపారు. సంబంధిత సర్వే నంబరులో మొరం అందుబాటులో లేకపోవడంతో, పక్కనే ఉన్న నంది గుట్ట నుంచి మొరం తవ్వేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ విషయంలో అధికారులు సహకరిస్తున్నట్లు సమాచారం ఉందని పేర్కొన్నారు.నంది గుట్టపై మైనింగ్ నిర్వహిస్తే గుట్టకు, ఆలయాలకు, పరిసర పర్యావరణానికి నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక మనోభావాలు దెబ్బతినే అవకాశం ఉందని తెలిపారు.

**నంది గుట్టను కాపాడాలి**

నంది గుట్ట ప్రాధాన్యాన్ని గుర్తించి, అక్కడ ఎలాంటి మైనింగ్ కార్యకలాపాలకు





అనుమతులు మంజూరు చేయకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను బోడ మహేందర్ కోరారు. అయ్యప్ప స్వామి ఆలయం, శివాలయంతో పాటు పరిసరాల్లోని ఇతర ఆలయాల పవిత్రతను కాపాడాలని, భవిష్యత్తులోనూ నంది గుట్టపై మైనింగ్ అనుమతులు ఇవ్వకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATEHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST-506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATEHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST-506349. TELANGANA STATE, TITEL-code: RNI NUMBER; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com